కలుపు కష్టాలు..

పత్తిలో విపరీతంగా పెరుగుతున్న గడ్డి, పిచ్చి మొక్కలు

- నీరు నిలిచి కుళ్లిపోతున్న వేర్లు
- పెరిగిన కూలిరేట్లు, మందుల ధరలు
- ఆందోళనలో రైతులు



కొణిజర్లలోని ఓ రైతు పత్తిచేనులో విపరీతంగా పెరిగిన కలుపు

కొణిజర్ల: ఇటీవల కురుస్తున్న చిరు జల్లులు పత్తి రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. ఎన్నో ఆశలకు సాగుకు శ్రీకారం చుట్టిన రైతులకు పత్తిలో విపరీతంగా పెరుగుతున్న కలుపు ఇబ్బందులు పెడుతోంది. వర్షం కురుస్తుండటంతో పత్తిలో పాటు చేసే అవకాశం లేక కలుపు విపరీతంగా పెరిగిపోతోంది, కూలీలతో తీయించడానికి కూడా వీలు లేని పరిస్థితి. మరో వైపు నల్ల రేగడి నేలల్లో నీరు నిలిచి ఉన్న ప్రాంతాల్లో పత్తి మొక్కలు వేరుకుళ్లతో ఎర్రబడి ఎండిపోతున్నాయి. సస్యరక్షణ చర్యలు చేపట్టేందుకు వెసులుబాటు లేక రైతులు ఆందోళన చెందుతున్నారు.

మండలంలో సుమారుగా 16 వేల ఎకరాల్లో రైతులు పత్తిసాగు చేస్తున్నారు. పత్తితో పాటు పెసర సాగు చేసినప్పటికీ అగ్రభాగం పత్తికే దక్కుతుంది. రైతులంతా అక్టోబర్ నాటికి పత్తి ఒకసారి తీసి దున్ని నవంబర్‌లో మొక్కజొన్న సాగు చేస్తుంటారు. ఈ నేపథ్యంలో రైతులు ఎకరానికి రూ.15 వేల నుంచి రూ. 20 వేల వరకు ఖర్చు పెట్టి పత్తిసాగు చేశారు. వారాల వ్యవధిలో మొక్క ఉన్న సమయంలో వారం పది రోజులుగా ప్రతీ రోజూ వాన పడుతుంది. దీంతో పత్తిలో కలుపు విపరీతంగా పెరిగిపోతోంది. పత్తిలో పాటు చేసే పరిస్థితి లేదు. కలుపు మనుషులతో తీయించాలంటే ఎకరానికి 20 నుంచి 25 మంది కూలీలు అవసరమవుతున్నారు. వీరికి రోజుకు రూ.300 చొప్పున కూలీ ఇవ్వవలసి వస్తుంది. కలుపు నివారణ మందులు పిచికారీ చేసినా అదనంగా ఖర్చు పెరిగిపోతుంది. ఎకరానికి రూ.3 వేలు నుంచి రూ.4 వేల వరకు రైతులకు అదనంగా ఖర్చు వస్తుంది. మండలంలో అధిక శాతం గ్రామాలలో నల్లరేగడి నేలలు కావడంతో తేమ వారం పది రోజుల వరకు ఆరే పరిస్థితి లేదు. జాలు ఎక్కువగా ఉన్న పొలాల్లో నీరు నిలిచి వేరు కుళ్లు వస్తోంది. దీంతో పంట ఆదిలోనే తమకు కష్టాలు వచ్చాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



పల్లిపాడులో..

కలుపు తీసే పరిస్థితి లేదు



వారం రోజులుగా చిరు జల్లులు పడుతున్నాయి. మావి నల్లరేగడి నేలలు కావడంతో తేమ ఆరడం లేదు. పాటు చేద్దామంటే భూమి ఆరక అరక తిరిగే పరిస్థితి లేదు. కలుపు మందులు పిచికారీ చేద్దామన్నా వాన వల్ల కుదరడం లేదు. దీంతో ఖర్చు విపరీతంగా పెరిగి అవకాశం ఉంది. కనీసం వారం రోజులు ఎండకాస్తే పత్తిలో పాటు చేసే అవకాశం ఉంటుంది.

– నల్లపాటి నరసింహారావు, రైతు, లక్ష్మీపురం

రైతులు జాగ్రత్తలు తీసుకోవాలి



రైతులు పత్తిలో పాటు చేసి కలుపు నివారణ చేసుకునే పరిస్థితులు లేకుండాపోయాయి. కలుపు నివారణ మందులు వాడుతున్నారు. ఇవి వాడే సమయంలో తగిన జాగ్రత్తలు వహించాలి. ఏ పంటకు సంబంధించిన కలుపు నివారణ మందు ఆ పంటకే కొట్టాలి. ఇతర మందులు వాడినా, కలుపు మందు అధికంగా పిచికారీ చేసినా మొక్కలు మాడిపోయే అవకాశం ఉంది.

– డి.బాలాజీ, ఏఓ, కొణిజర్ల

విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలి

- జెడ్పీ చైర్మన్ కమల్‌రాజ్



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న కమల్‌రాజ్

చింతకాని: విద్యార్థులు కష్టపడి చదువుతూ ఉన్నత స్థాయికి ఎదగాలని జెడ్పీ చైర్మన్ లింగాల కమల్ రాజ్ సూచించారు. మండల పరిధిలోని పందిళ్లపల్లి ఉన్నత పాఠశాలను ఆయన శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుల హాజరు రిజిష్టర్, డిజిటల్ క్లాస్ రూం, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... నాణ్యమైన విద్యను బోధించాలని, విద్యార్థులు క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరయ్యే విధంగా ప్రత్యేక దృష్టి సారించాలని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థులతో మాట్లాడి పాఠశాలలో ఏమైనా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలకు కావాల్సిన వసతులను ప్రధానోపాధ్యాయులను అడిగి తెలుసుకుని సాధ్యమైనంత వరకు వసతుల కల్పనకు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ రామయ్య, మండల పంచాయతీ అధికారి మల్లెల రవీంద్ర ప్రసాద్, హెచ్ఎం రాంమోహన్‌రావు, పంచాయతీ కార్యదర్శి నిఖిల్, ఉపాధ్యాయులు, బీఆర్ఎస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

నీరు కలుషితమవుతున్నా పట్టించుకోరా?

- సర్వసభ్య సమావేశంలో ప్రజాప్రతినిధులు ఆగ్రహం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ వరలక్ష్మి

ఏన్కూరు: మిషన్‌భగీరథ నీరు కలుషితం అవుతుందని, మురికినీరు ప్రజలు తాగలేక పోతున్నారని, పైపులీకులు ఉన్నా పట్టించుకోవడం లేదని సర్వసభ్య సమావేశంలో ప్రజాప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం సర్వసభ్యసమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వైస్ ఎంపీపీ పాశం శ్రీనివాసరావు, ఎంపీటీసీలు లచ్చిరాంనాయక్, లక్ష్మానాయక్ అధికారులను నిలదీశారు. మర్సకుంట, తూతకలింగన్నపేట, ఆరికాయలపాడు గ్రామాల్లో మిషన్‌భగీరథ ద్వారా మురికినీరు వస్తుందని, తాగునీటిని క్లోరినేషన్ చేయడం లేదన్నారు. గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న వైద్యాధికారులు పట్టించుకోవడం లేదని, ప్రభుత్వ వైద్యాధికారులు సమయపాలన పాటించకుండా స్థానికంగా ఉండడం లేదన్నారు. వ్యవసాయాధికారులు జీలుగులు సరిపడా పంపిణీ చేయడం లేదని, పోడుభూములు పట్టాలు ఇచ్చారు కాని అవి సాగులోకి లేవని, దీనికి రైతుబంధుల ఇస్తున్నారన్నారు. ఒకే సర్వే నంబర్‌లో ఒకే భూమిపై ముగ్గురు యాజమానులు ఉంటున్నారని, ఉపాధిహామీ కూలీ చెల్లింపులు సకాలంలో జరగడం లేదని, అధికారులు పనితీరు మార్చుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ అరెం వరలక్ష్మి, జెడ్పీటీసీ బాదావత్ బుజ్జీ, వైస్ ఎంపీపీ పాశం శ్రీనివాసరావు, తహసీల్దార్ సిహెచ్ శేషగిరిరావు, ఎంపీడీఓ సకినాల రమేష్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

మత్స్య సహకార సంఘం అధ్యక్షుడిని కలిసిన ఎంపీపీ



పుష్పగుచ్ఛం అందజేస్తున్న రఘు తదితరులు

కల్లూరు/కల్లూరురూరల్: మత్స్య సహకార సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మెట్టు సాయికుమార్‌ను హైదరాబాద్ రాష్ట్ర కమిషనరేట్‌లో శుక్రవారం ఎంపీపీ బీరవల్లి రఘు కలిశారు. మత్స్యకారుల సంక్షేమం, చేప పిల్లల ఉత్పత్తిపై చర్చించారు. ఎంపీపీతో పాటు వరంగల్ జిల్లా పరిషత్ ఉపాధ్యక్షుడు ఆకుల శ్రీనివాస్, కృషి విజ్ఞాన కేంద్రం జమ్మికుంట శాస్త్రవేత్త ప్రభాకర్ పాల్గొన్నారు.

వైఎస్ జగన్‌ను కలిసిన అభిమాని



వైఎస్ జగన్‌తో వంశీ

సత్తుపల్లిటౌన్: వైఎస్ఆర్ సీపీ అధినేత, ఏపీ మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డిని సత్తుపల్లికి చెందిన అభిమాని జొన్నల గడ్డ కృష్ణ వంశీ శుక్రవారం తాడేపల్లిలోని ఆయన నివాసంలో కలిశారు.

రేపు రాష్ట్రస్థాయి విద్యా వైజ్ఞానిక తరగతులు

మధిర: పట్టణంలో శనివారం, ఆదివారం పీవైఎల్ రాష్ట్రస్థాయి విద్యా వైజ్ఞానిక తరగతులు నిర్వహిస్తున్నట్టు యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్‌వి.రాకేష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ జిల్లాల నుంచి ప్రతినిధులతో తరగతులు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. శనివారం జెండా ఆవిష్కరణతో ప్రారంభమవుతుందని, అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

బీజేపీ మండల అధ్యక్షుడిగా గోపి



చింతకాని: బీజేపీ మండల అధ్యక్షుడిగా మండలంలోని నాగులవంచకు చెందిన కొండా గోపి నియమితులయ్యారు. ఆయనకు జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ శుక్రవారం నియామక పత్రాన్ని అందజేశారు. అనంతరం గోపి మాట్లాడుతూ... ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూనే మండలంలో పార్టీ బలోపేతానికి పాటుపడతానన్నారు. నాయకులు అనగాని రామారావు, సత్తెనపల్లి గోపి, చెన్నూరి నాగాచారి, గోదా మంగయ్య, పగడాల విఘ్నేష్, సుందర్‌రావు పాల్గొన్నారు.

సొసైటీ డైరెక్టర్ మృతిపై సంతాపం



లక్ష్మీనారాయణ (ఫైల్)

కొణిజర్ల: గోపవరం సొసైటీ డైరెక్టర్, మండలంలోని అమ్మపాలెంకు చెందిన గునుగంటి వెంకటలక్ష్మీనారాయణ గురువారం అర్ధరాత్రి మృతి చెందాడు. కొంత కాలంగా కేన్సర్‌తో బాధపడుతున్న ఆయన మృతి చెందగా, సీపీఐ, సీపీఎం జిల్లా కార్యదర్శులు పోటు ప్రసాద్, నున్నా నాగేశ్వరరావు తదితరులు శుక్రవారం నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కాగా, లక్ష్మీనారాయణకు ఇద్దరు కుమార్తెలు కావడంతో పెద్ద కూతురు రితిక తలకొరివి పెట్టింది. సొసైటీ చైర్మన్ చెరుకుమల్లి రవి, సీఈఓ వెంకటేశ్వర్లు, నాయకులు, కార్యకర్తలు ఆయన అంత్యక్రియల్లో పాల్గొని నివాళులర్పించారు.


బీరువాల వితరణ

కారేపల్లి: మండలపరిధిలోని విశ్వనాథపల్లి హైస్కూల్‌కు ఎన్ఆర్ఐ చెరుకూరి వేణుమాధవ్ తన తల్లిదండ్రుల జ్ఞాపకార్థం ఇనుప బీరువాలను శుక్రవారం వితరణగా అందజేశారు. ఈ కార్యక్రమంలో మేదరమెట్ల ప్రేమ్‌చంద్, తాత వెంకటేశ్వర్లు, తాత రవికుమార్, హెచ్ఎం పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

వైద్యశిబిరం

వేంసూరు: మండల పరిధిలోని కుంచపర్తి, వెంకటాపురం, శంబూనిగూడెం గ్రామాల్లో శుక్రవారం ప్రత్యేక వైద్యశిబిరం నిర్వహించారు. ఈ మేరకు డాక్టర్ ఇందు ప్రియంక పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ప్రభుత్వం వైద్యశాలలో నాణ్యమైన వైద్యం అందిస్తునట్లు తెలిపారు.

కళకళలాడుతున్న గంగదేవిపాడు వాగు



తల్లాడ: రెండురోజులుగా కురుస్తున్న వర్షాలకు మండలంలోని గంగదేవిపాడు నీటితో కళకళలాడుతోంది. పినపాక-వెంకటాపురం గ్రామాల మధ్యవాగు ఉధృతంగా ప్రవహిస్తోంది.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి



నిరసన తెలుపుతున్న విద్యార్థులు

మధిర: విద్యారంగ సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో శుక్రవారం విద్యార్థులు ప్రదర్శన నిర్వహించి మానవహారంతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి వి.వెంకటేష్ మాట్లాడుతూ... కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాక ముందు విద్యారంగానికి పెద్దపీట వేస్తామని, అధిక నిధులు కేటాయిస్తామని హామీ ఇచ్చి ఇప్పుడు పెట్టుబడులు, రుణమాఫీ పేరుతో కాలయాపన చేస్తుందన్నారు. విద్యా సంవత్సరం ప్రారంభమై నెలలు గడుస్తున్నప్పటికీ మౌలిక వసతులు కల్పించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో కూడా మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రవేశపెడతామని ఇచ్చిన హామీ నేటికీ అమలుకు నోచుకోవడం లేదన్నారు. పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్ షిప్ నిధులు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు అనూష, శైలజ, స్పందన, సాయి, రాకేష్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

యంత్రాలపై అవగాహన

ఏన్కూరు: వాటర్‌షెడ్ సంస్థ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో శుక్రవారం వ్యవసాయ యంత్రాలపై శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధి రవీందర్, వసుంధర, ప్రణయ్, నరేష్ పాల్గొన్నారు.

సరుకుల వితరణ

కారేపల్లి: మండలంలోని సింగరేణి పంచాయతీ కార్మికులకు బీఆర్ఎస్ మైనారిటీ సెల్ నాయకులు ఎస్.కె. గౌసుద్దీన్ శుక్రవారం నిత్యావసర సరుకులు అందజేశారు. ఈ మేరకు 50 కేజీల బియ్యంతో సరుకులు అందజేశారు. కార్మికులు లచ్చయ్య, కొమరయ్య, సుల్తానా, యాదగిరి, ఉమా, శ్రీను, పద్మ, తిరుపతయ్య, గౌతమ్, పాల్గొన్నారు.

హెచ్చరిక బోర్డు ఏర్పాటు



మధిరరూరల్: మధిర – మడుపల్లి రహదారిలో తరచూ ప్రమాదాలు జరుగుతున్న ప్రాంతంలో మడుపల్లి హైస్కూల్ 2005 సంవత్సరం బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థులు శుక్రవారం ప్రమాద హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశారు. రోడ్డు ప్రమాదాలను దృష్టిలో పెట్టుకున్న పూర్వ విద్యార్థులు స్పందించి బోర్డు ఏర్పాటు చేయడంపై పలువురు వారిని అభినందించారు.

ఉపాధ్యాయులకు సన్మానం

తల్లాడ: మండలంలోని కుర్నవల్లి జిల్లా పరిషత్ పాఠశాలలో బదిలీపై వెళ్లిన 11 మంది ఉపాధ్యాయులను శుక్రవారం గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. హెచ్ఎం ఝాన్సీ, బదిలీపై వెళ్లిన హెచ్ఎం శీలం శ్రీనివాసరెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ముదిగొండ: మండలపరిధిలోని పండ్రేగుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి బదిలీ, పదోన్నతులు పొందిన ఉపాధ్యాయులు మాధవి, భారతి, రమేష్‌లను పాఠశాల పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శైలజ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఉపాధ్యాయులు శర్మ, నరేందర్, అరుణ, అనిల్, ప్రసాదరావు, రాణి, నాగేశ్వరరావు విద్యార్థులు పాల్గొన్నారు.

రోడ్డుపై నాటేసి నిరసన



నాటు వేస్తూ నిరసన తెలుపుతున్న కాలనీవాసులు

వేంసూరు: మండలకేంద్రంలోని డబుల్ బెడ్ రూం కాలనీలో సీసీ రోడ్డు, డ్రెయినేజీలు నిర్మించాలని కోరుతూ సీపీఐ ఆధ్వర్యంలో స్థానికులు శుక్రవారం రోడ్ల పై నాట్లు వేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు దండు ఆదినారాయణ మాట్లాడుతూ... కాలనీ రోడ్లు వర్షానికి బురదమయంగా మారి నడిచేందుకు సైతం వీలు లేకుండా మారాయన్నారు. నీరు నిల్వ ఉండటంతో దోమలు వ్యాప్తి చెంది కాలనీ ప్రతీ ఇంట్లో జ్వర పీడితులు ఉన్నారని, వైద్యాధికారులు కాలనీలో వైద్య శిబిరం నిర్వహించాలని డిమాండ్ చేశారు. నాయకులు ఎస్‌కె.రంజాన్, కిన్నెర మారయ్య, ఎస్‌కె.హమీద్, లాల్ మహమ్మద్, సంతోష్, శ్రీలత, బాజీ, కృష్ణమ్మ, తిరుపతిరావు నాగుర్, సుప్రియ, యాకూబ్, ప్రసాద్, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



చెక్కులు అందజేస్తున్న సుధాకర్‌రెడ్డి

ఎర్రుపాలెం: మండలంలోని పెగళ్లపాడు, తెల్లపాలెం, ఎర్రుపాలెం గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను శుక్రవారం మండలకేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పార్టీ మండలాధ్యక్షుడు వేమిరెడ్డి సుధాకర్ రెడ్డి అందజేశారు. నరసింహారావు, కడియం శ్రీనివాసరావు, దేవరకొండ రాజీవ్‌గాంధీ, షేక్ ఇస్మాయిల్, గుడేటి బాబురావు, షేక్ బాజీ, దేవరకొండ ఏడుకొండలు, నాగరాజు తదితరులున్నారు.

తవ్వారు.. వదిలేశారు..



పూడ్చకుండా వదిలేసిన గొయ్యి

సత్తుపల్లిటౌన్: పట్టణంలోని కృష్ణ మందిరం వద్ద రాజీవ్‌రోడ్‌కు వెళ్లే దారిపైన పైపుల మరమ్మతు కోసం గొయ్యి తవ్వారు. వారం రోజులైన ఇంకా పూడ్చకపోవటంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. నిత్యం వాహనాలు, ప్రజల రాకపోకలతో రద్దీగా ఉండే ఈ రహదారి తవ్వినా అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా స్పందించి గొయ్యిని పూడ్పించాలని కోరుతున్నారు.

ఫిజియోథెరపి శిబిరం



ఫిజియోథెరపి చేస్తున్న వైద్యుడు

కల్లూరు: మండలంలోని అంబేద్కర్‌నగర్ స్కూల్‌లో సమగ్రశిక్ష ఆధ్వర్యంలో దివ్యాంగ చిన్నారులకు శుక్రవారం ఉచిత ఫిజియోథెరపి శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఫిజియోథెరపిస్ట్ మాగంటి ప్రభాకర్‌రావు పిల్లలకు చికిత్స నిర్వహించారు. ప్రతీ శుక్రవారం జరిగే శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలనారు. ఈ కార్యక్రమంలో ఐఈఆర్‌పీ వై.సుధారాణి, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

సత్తుపల్లిరూరల్: మండలంలోని గౌరిగూడెం విద్యుత్ సబ్‌స్టేషన్ మరమ్మతుల దృష్ట్యా శనివారం ఉదయం 8.30 గంటల నుంచి 10.30 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్‌శాఖ ఏఈ శరత్‌బాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు కొత్తూరు, గౌరిగూడెం, రేజర్ల, సర్వారాయ షుగర్స్, రాజీవ్‌నగర్‌ల్లో అంతరాయం కలుగుతుందని తెలిపారు.

పెనుబల్లి : పెనుబల్లి విద్యుత్ ఉప కేంద్రంలో మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ ఏఈ భుజేంద్రకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు ఉప కేంద్రం పరిధిలోని పెనుబల్లి, వియం బంజర్, రామచందర్‌రావుబంజర్, రంగారావు బంజర్, సీతారామపురం, టేకులపల్లి, బయ్యన్నగూడెం, నాయకులగూడెం గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు పేర్కొన్నారు.

వైరారూరల్: మండలంలోని గరికపాడు సబ్‌స్టేషన్ మరమ్మతులు, తల్లాడ మండలం కుర్నవల్లి నుంచి గరికపాడు వరకు లింక్‌లైను పనుల నిమిత్తం శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నారపునేనిపల్లి, విప్పలమడక, లింగన్నపాలెం, గరికపాడు, దాచాపురం, గన్నవరం, గోవిందపురం గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు రూరల్ ఏఈ పాలేటి వెంకటసాయి తెలిపారు.

ముదిగొండ: మండలపరిధిలోని న్యూ లక్ష్మీపురం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో మరమ్మతులు, చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా రేపు ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ ఏఈ ఎం శ్రీనివాస్ తెలిపారు.

క్యాంపస్ రిక్రూట్‌మెంట్

కొణిజర్ల: మండలంలోని తనికెళ్ల సమీపంలోగల విజయ ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం ఆన్ క్యాంపస్ రిక్రూట్‌మెంట్ నిర్వహించారు. హైదరాబాద్‌కు చెందిన విన్సున్ గ్లోబల్ టెక్నాలజీ, కిట్స్ కార్ట్ ఇన్నోవేషన్స్ సంస్థ వారు సంయుక్తంగా నిర్వహించిన ఈ క్యాంపస్ ప్లేస్‌మెంట్‌లో 35 మంది విద్యార్థులను ఉద్యోగాలకు ఎంపిక చేసినట్టు విన్సున్ గ్లోబల్ టెక్నాలజీ హెచ్‌ఆర్ మేనేజర్ బి.సురేష్, కిట్స్‌కార్ట్ మేనేజింగ్ డైరెక్టర్ జి.సూర్యప్రకాశ్‌లు తెలిపారు. కళాశాల వైస్ చైర్మన్ పారుపల్లి విజయలక్ష్మి విద్యార్థులను అభినందించారు. ప్లేస్‌మెంట్ డైరెక్టర్ డాక్టర్ ఆయేషా తరుణ్యం, ప్రిన్సిపల్ జాన్‌బాబు, వైస్ ప్రిన్సిపాల్ చిన్నయ్య, డీన్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి పోరాటాలు



మాట్లాడుతున్న రాంబాబు

బోనకల్: ఉపాధ్యాయ సమస్యల పరిష్కారంలో రాజీలేని పోరాట నిర్వహిస్తున్న ఛాంపియన్ సంఘం యూటీఎఫ్ అని సంఘం జిల్లా కోశాధికారి వీ రాంబాబు అన్నారు. యూటీఎఫ్ సభ్యత్వం, జనరల్ ఫండ్ క్యాంపెయిన్‌లో భాగంగా పలువురు సంఘం నాయకులు మండలంలోని పలు పాఠశాలలను శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉన్నత పాఠశాలలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను ప్రమోషన్లతో భర్తీ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సదాబాబు, ప్రీతం, గుగులోతు రామకృష్ణ, గోపాలరావు, సౌభాగ్య లక్ష్మి, నిర్మలకుమారి, నరసింహారావు, పుల్లారావు, రంగారావు, లక్ష్మణరావు, నాగ మహేష్ శ్రీనివాసరావు నాగేందర్, కమలాకర్ శ్రీనివాసరావు, అప్పారావు పాల్గొన్నారు.

అన్నదానం



భోజనం వడ్డిస్తున్న క్లబ్ సభ్యులు

వైరారూరల్: మండలంలోని గొల్లపూడి వృద్ధాశ్రమంలోని వృద్ధులకు శుక్రవారం చింతలపూడి జోగమ్మ వర్ధంతి సందర్భంగా ఆమె కుమారుడు చింతలపూడి వెంకటేశ్వర్లు లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. క్లబ్ బాధ్యులు చింతోజి నాగేశ్వరరావు, కొల్ల రాంబాబు, కట్ల సురేష్, తాటికొండ రాము, నరసింహరావు పాల్గొన్నారు.

సృజనాత్మకంగా బోధించండి

సత్తుపల్లిటౌన్: ఆటపాటలతో పిల్లల్లో సృజనాత్మకతను పెంపొందించేలా చిన్నారులకు బోధించాలని ఐసీడీఎస్ మాస్టర్ ట్రైనర్ జె.సుజాత అన్నారు. సత్తుపల్లిలో శుక్రవారం పెనుబల్లి మండలానికి చెందిన అంగన్‌వాడీలకు పూర్వ ప్రాథమిక విద్యపై పునశ్చరణ తరగతులు నిర్వహించారు. సూపర్‌వైజర్లు సుజాత, భవాని, సంధ్యారాణి, పోషణ్ అభియాన్ బ్లాక్ కో ఆర్డినేటర్ హరీష్ పాల్గొన్నారు.

వేంసూరు: మండలకేంద్రంలోని రైతువేదికలో అంగన్‌వాడీ టీచర్లకు శిక్షణ నిర్వహించారు. సూపర్‌వైజర్లు మల్లీశ్వరీ, భవాని, కమల ఉన్నారు.

పరిశుభ్రత పాటించండి



అవగాహన కల్పిస్తున్న డాక్టర్ అవినాష్

సత్తుపల్లిరూరల్: ప్రతీ ఒక్కరు వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించినట్లైతే వ్యాధులు దరిచేరవని గంగారం పీహెచ్‌సీ వైద్యులు అవినాష్ అన్నారు. శుక్రవారం కాకర్లపల్లిలో జరిగిన ఫ్రైడే డ్రైడే కార్యక్రమం, ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. సూపర్‌వైజర్ నర్సింహారావు, ఏఎన్ఎంలు పద్మ, మంజుల పాల్గొన్నారు.

నివాళి..

పెనుబల్లి: మండల పరిధిలోని లంకపల్లి గ్రామానికి ఆటోయూనియన్ ప్రెసిడెంట్ కొనకాల చిన్న వెంకటేశ్వరరావు, రామచందరావు బంజర్ గ్రామానికి చెందిన నాయకులు యలమర్తి సత్యనారాయణ శుక్రవారం మృతి చెందగా వారి మృతదేహాలకు కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయ్‌కుమార్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబాలను పరామర్శించారు.

పనులు నాణ్యతతో చేపట్టాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ శ్రీధర్‌స్వామి

ముదిగొండ: అమ్మ ఆదర్శ పాఠశాలల్లో చేపట్టిన పనులు నాణ్యతతో త్వరితగతిన పూర్తిచేయాలని ఎంపీడీఓ శ్రీధర్‌స్వామి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో అమ్మ ఆదర్శ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, కమిటీ చైర్మన్లతో పాఠశాలల్లో పనులు పురోగతిపై శుక్రవారం సమావేశం నిర్వహించారు. పెండింగ్ పనుల రిపోర్టును అందజేయాలన్నారు. ఎంఈఓ రామాచారి, మండల నోడల్ ఆఫీసర్ రమణయ్య, ఏఈ నాగేశ్వరరావు, ఏపీఎం కల్పన, సిబ్బంది పాల్గొన్నారు.

వన మహోత్సవం

కారేపల్లి : మండలంలోని రేలకాయలపల్లి ప్రభుత్వ గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాలలో శుక్రవారం వన మహోత్సవాన్ని పండుగలా జరిపారు. విద్యార్థులు ఉపాధ్యాయుల మొక్కలు నాటారు. హెచ్ఎం కల్తీ కాంతారావు, డిప్యూటీ వార్డెన్ బి.ఈరన్న, ఉపాధ్యాయులు డీఎస్.నాగేశ్వరరావు, బి.వెంకటేష్, దేవ్ సింగ్, మాన్‌సింగ్, రాంబాబు, సక్రాం, జి.వీరన్న, సిహెచ్.వెంకటేశ్వర్లు, డి.తార, పద్మ, పీఈటీ వీరన్న తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఎంఎంఎస్‌కు ఎంపిక

సత్తుపల్లి: సత్తుపల్లి శ్రీవాణి బాలికల కళాశాల విద్యార్థినులు నేషనల్ మెరిట్ స్కాలర్‌షిప్‌నకు ఎంపికయ్యారు. తెలంగాణ ఇంటర్ బోర్డు ప్రకటించిన జాబితాలో మెరిట్ స్కాలర్‌షిప్‌లకు కళాశాల నుంచి ఎంపికైన విద్యార్థులకు ప్రిన్సిపాల్ పాలా ప్రవీణ్‌రెడ్డి విద్యార్థులకు అభినందనలు తెలిపారు.

బడి బస్సులు బంద్



ఎత్తులో ఏర్పాటు చేసిన కల్వర్టు

మధిరరూరల్: మండలంలోని జిలుగుమాడు గ్రామంలో రోడ్డుకి అడ్డంగా తవ్వి కల్వర్టు కోసం సిమెంట్‌పైపును ఎత్తుగా ఏర్పాటు చేయడంతో నక్కలగరుబు గ్రామానికి శుక్రవారం బడి బస్సులు బంద్ అయ్యాయి. నక్కలగరుబు గ్రామానికి స్కూల్ బస్సులు వెళ్లాలంటే జిలుగుమాడు మీదగా ప్రయాణించాల్సిందే. దీంతో మధిర నుంచిగ్రామానికి వెళ్లేందుకు ఇదే ప్రధాన రహదారి కావడంతో అక్కడ రోడ్డు మీద కొంతమంది బొంగును ఎత్తులో నిర్మించడంతో బస్సులు ఆగిపోయాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఈ సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.